# తిప్పలు తీర్చే అప్పులు!

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల ఢిల్లీలో సూక్ష్మ పారిశ్రామిక సంస్థల అభివృద్ధి ఆర్థిక సహాయ సంస్థ (ముద్రా బ్యాంకు)ను ప్రారంభించారు. ఆ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ప్రసంగించిన ఆయన, 'ముద్రా' ఆవశ్యకతను నొక్కి చెప్పారు. 'ముద్రా' అంటే హిందీలో పెట్టుబడి అని అర్థం. పెట్టుబడి ప్రాముఖ్యాన్ని ఆయన చాటి చెప్పారన్న మాట. బ్యాంకు ఖాతాలేనివారికి బ్యాంకు సేవలు అందించాలన్నది జన్‌ధన్ యోజన లక్ష్యం. ఆర్థిక వనరులు లేనివారికి నిధులు సమకూర్చేందుకు ఉద్దేశించిందే ముద్రా బ్యాంకు. అభివృద్ధి వల్ల సమ్మిళిత వృద్ధి సాధ్యపడాలని, కేవలం బడా సంస్థల వల్లే అది సాకారం కాదన్నది ప్రభుత్వ భావన అని ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలోనే స్పష్టం చేశారు. దేశంలో దాదాపు ఆరు కోట్ల సూక్ష్మ, చిన్న స్థాయి సంస్థలు ఉన్నాయి. వాటిలో చాలా భాగం వ్యక్తుల స్థాయిలో నడుస్తున్న చిన్న చిన్న తయారీ, వ్యాపార, సేవా సంస్థలే. అలాంటి సంస్థల్లో నాలుగు శాతం మాత్రమే సంస్థాగత రుణాలు పొందగలుగుతున్నాయి. ఆ సంస్థలకు ఆర్థిక వనరులు సమకూర్చి వృద్ధికి, ఉపాధి కల్పనకు సాధనాలుగా వాటిని తీర్చిదిద్దాలన్నదే ముద్రా బ్యాంకు ఏర్పాటు వెనుక గల ఉద్దేశం.

## ప్రయోజనాల విస్తరణ

ముద్రా బ్యాంకు రూ.20,000కోట్ల మూలనిధి కలిగి ఉంటుంది. అందులో రూ.3000కోట్లను రుణహామీ కార్యక్రమం అమలుకు నిర్దేశించారు. సూక్ష్మ పారిశ్రామిక సంస్థలకు సహాయం అందించే ఆర్థిక సంస్థలకు తోడ్పడేందుకు ఆ నిధిని ఉపయోగించుకొంటారు. ఆ విధంగా ముద్రా బ్యాంకు ఒక నియంత్రణ వ్యవస్థగా వ్యవహరిస్తుందన్న మాట. సూక్ష్మ ఆర్థిక సంస్థలకు అది నిధులు సమకూరిస్తే, ఆ సంస్థలు చిన్న పారిశ్రామిక సంస్థల్ని ఆదుకొంటాయి. తద్వారా వాటి అభివృద్ధికి తోడ్పడతాయి. మొట్టమొదటిసారిగా చిన్నతరహా పారిశ్రామిక సంస్థలు ఏర్పాటు చేయాలన్న ఉత్సుకత కలిగిన యువత, విద్యావంతులు, నిపుణుల్లో ఆత్మవిశ్వాసం కలిగించడంలో ముద్రా బ్యాంకు విజయం సాధించగలదన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. ముద్రా బ్యాంకు అన్నది పై నుంచి కిందికి నిధుల్ని ప్రవహింపజేసే సంస్థ. దానినుంచి అందే ఆర్థిక సహాయంతో వివిధ రకాల వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించవచ్చు. చిన్నచిన్న తయారీ సంస్థలతోపాటు దుకాణాలు, పండ్లు, కూరగాయల అమ్మకం; క్షౌరశాలలు; బ్యూటీపార్లర్లు; రవాణా వాహనాలు, ట్రక్కుల కొనుగోలు; చిల్లర వ్యాపారాలు; రిపేరు షాపులు; గ్రామ, పట్టణ ప్రాంతాల్లో చేతివృత్తుల వంటి వాటికి దీనికింద ఆర్థిక సహాయం లభిస్తుంది. రూ.10 లక్షల వరకు సాయం పొందవచ్చు. ఆర్థిక సహాయం అవసరమైన వ్యాపార కార్యకలాపాల్ని మూడుగా విభజించి, భిన్నరకాల సహాయ పథకాల్ని వాటికి వర్తింపజేయనున్నారు. అవి- శిశు, కిశోర్, తరుణ్ పథకాలు. సూక్ష్మ సంస్థలకు వాటి స్థాయినిబట్టి ఈ పథకాలకింద ఆర్థిక సహాయం అందిస్తారు. శిశు పథకం కింద గరిష్ఠంగా రూ.50వేలు; కిశోర్ పథకం కింద రూ.50వేల నుంచి రూ.అయిదులక్షల వరకు; తరుణ్ పథకం కింద రూ.అయిదులక్షల నుంచి రూ.10లక్షల దాకా రుణసహాయం అందుతుంది.

ఈ పథకాన్ని ఆరంభంలోనే అనేక రంగాలు, కార్యకలాపాలకు విస్తరింపజేశారు. ఉపరితల రవాణా, సామాజిక-వ్యక్తిగత సేవలు, ఆహారం, జౌళి ఉత్పత్తుల వంటి వాటిని దీని పరిధిలోకి తెచ్చారు. రానున్న కొన్నేళ్లలో దాన్ని ఇతర రంగాలు, కార్యకలాపాలకు వర్తింపజేయనున్నారు. నిర్దేశిత లబ్ధిదారులందరికీ అన్నివిధాలా సహాయం అందజేసేందుకు ముద్రా బ్యాంకు ముందుకు వస్తోంది. ఆర్థిక పరిజ్ఞానం సమకూర్చడం; కింది స్థాయి సంస్థలకు మద్దతు; వ్యాపార కార్యకలాపాలకు ఆర్థిక సహాయం అందజేసే చిన్న సంస్థలకోసం ఒక వ్యవస్థ ఏర్పాటు; జాతీయ గ్రామీణ జీవనోపాధి సంస్థ, జాతీయ నైపుణ్యాల అభివృద్ధి సంస్థలతో సమన్వయం; రుణ, రేటింగ్ సంస్థలతో కలిసి పనిచేయడం లక్ష్యాలుగా అది ముందడుగు వేస్తోంది. సూక్ష్మ పారిశ్రామిక సంస్థలకు రుణాలు అందజేసే ఆర్థిక సంస్థల కోసం మార్గదర్శక సూత్రాల రూపకల్పన; రుణాల ఊబిలోనుంచి వాటిని బయటపడేసేందుకు బాధ్యతాయుతమైన విధానాల పరికల్పన; రుణగ్రహీతల పరిరక్షణకు, రుణాల వసూలుకు సరైన పద్ధతులను రూపొందించడం; సూక్ష్మ పారిశ్రామిక రంగం అభివృద్ధికి అన్నివిధాలా తోడ్పాటు అందజేయడం- ముద్రా బ్యాంకుకు అప్పగించిన బాధ్యతలు. సూక్ష్మ పారిశ్రామిక సంస్థల్లో చాలా భాగం చట్టబద్ధ వ్యవస్థ పరిధిలోకి రావడం లేదు. వాటికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయమూ అందడం లేదు. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి అత్యధిక వడ్డీలకు అవి రుణాలు తెచ్చుకోవలసి వస్తోంది. ఒక్కోసారి వార్షిక వడ్డీ నూరు శాతాన్ని మించిపోతోంది. దాంతో ఆ సంస్థలు పూర్తిగా రుణగ్రస్తమైపోతున్నాయి. ప్రామాణిక వడ్డీరేటునే తప్ప, అంతకుమించి చెల్లించాల్సిన అవసరం చిన్న సంస్థలకు లేకుండా, అవి మోసాల బారిన పడకుండా చూడటానికి ఒక విధానం అవసరం. ఆ విధాన రూపకల్పనకు ముద్రా బ్యాంకు సహాయపడుతుంది. సూక్ష్మ ఆర్థిక సంస్థలకు సంబంధించి సమస్త వివరాలతో ఒక గణాంక నిధినీ ముద్రా బ్యాంకు రూపొందిస్తుంది. దాంతో ఏ సంస్థ నుంచి రుణం తీసుకొంటే మంచిదో నిర్ణయించుకునే వెసులుబాటు సూక్ష్మ పారిశ్రామిక సంస్థలకు లభిస్తుంది. ముఖ్యంగా బలహీనవర్గాలవారికి సహేతుక వడ్డీ రేట్లపై సహాయం అందేలా చూడటానికి ప్రాంతీయ, స్థానిక ఆర్థిక సంస్థలతో ముద్రా బ్యాంకు భాగస్వామ్యం పంచుకొంటుంది. ముద్రా బ్యాంకును ప్రస్తుతం భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) కింద బ్యాంకేతర ఆర్థిక సంస్థగా నమోదు చేశారు. సంబంధిత బిల్లును పార్లమెంటు ఆమోదించాక, ముద్రా బ్యాంకు చట్టబద్ధ సంస్థగా అవతరిస్తుంది. ఇది




చిన్న సంస్థలకు పెద్ద వరం- ముద్రా బ్యాంకు

వరకటి యూపీఏ ప్రభుత్వం రూపొందించిన సూక్ష్మ ఆర్థిక సంస్థల బిల్లులోని అంశాలను ఈ బిల్లులో పొందుపరుస్తారు. ముద్రా బ్యాంకు పనితీరు, ఉద్దేశాలతోపాటు సూక్ష్మరంగం నుంచి వసూలు చేసే వడ్డీ రేటును నిర్ణయించడానికి అది కలిగి ఉండే యంత్రాంగం గురించీ కొత్త బిల్లులో వివరిస్తారు.

ముద్రా బ్యాంకు ఏర్పాటు సరైన దిశలో వేసిన ముందడుగే. బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి భారీయెత్తున ఆర్థిక సహాయం పొందుతున్న బడా పరిశ్రమలు కోటి పాతిక లక్షల మందికే ఉపాధి కల్పించగలుగుతున్నాయి. దేశంలో దాదాపు ఆరు లక్షల సూక్ష్మ పారిశ్రామిక సంస్థలు ఉన్నాయి. అవి 12కోట్లమందికి ఉపాధినిస్తున్నాయి. దేశంలో సూక్ష్మ పారిశ్రామిక సంస్థలు, స్వయం సహాయక బృందాల పనితీరు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంది. వాటి నిరర్థక ఆస్తులు కనిష్ఠ స్థాయిలో ఉన్నాయి. పేదలు అత్యంత నీతి నిజాయతీలతో పనిచేస్తారని, అందుకే మంచి విజయాలూ సాధిస్తారని స్వయం సహాయక బృందాలు చాటి చెబుతున్నాయి. అట్టడుగు స్థాయిలో నిద్రాణంగా ఉన్న సృజనాత్మకతను చైతన్యపరచటంలో ముద్రా బ్యాంకు గణనీయ పాత్ర పోషించగలదు. దేశంలో మరో ఆర్థిక నియంత్రణ వ్యవస్థ అవసరమా అన్న ప్రశ్న ముద్రా బ్యాంకు ఏర్పాటుతో ఉత్పన్నమవుతోంది. భారత రిజర్వు బ్యాంకు, జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు), భారత చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు (సిడ్బీ) వంటివి విస్తృత స్థాయిలో ఆర్థిక సేవలు



డాక్టర్ చరణ్ సింగ్

అందజేస్తూ దేశీయ మార్కెట్లో ఇప్పటికే కీలక పాత్ర పోషిస్తున్నాయి. కానీ, జన్‌ధన్ యోజన విజయవంతమయ్యాక, మరో రంగంలో అంతరాన్ని పూడ్చాల్సిన అవసరం తలెత్తింది. అదే సూక్ష్మ పారిశ్రామిక రంగం. ఈ రంగానికి పెద్దస్థాయిలో ఆర్థిక సహాయం తక్షణావసరమని స్పష్టమైంది. 1934లో ఏర్పాటైన ఆర్‌బీఐ, బ్యాంకింగ్ వ్యవస్థను నియంత్రిస్తోంది, పర్యవేక్షిస్తోంది. గ్రామీణ, వ్యవసాయ రంగంపై దృష్టి సారించడానికి 1982లో ఆర్‌బీఐ నుంచి నాబార్డు ఏర్పాటు చేశారు. అదేవిధంగా చిన్న, సూక్ష్మ, మధ్యతరహా ఆర్థిక సంస్థలకు సహాయపడేందుకు 1990లో సిడ్బీని నెలకొల్పారు. నాబార్డు, సిడ్బీ, ఆర్‌బీఐల నుంచి కొన్ని బాధ్యతలను తన భుజాలమీదకు తీసుకొని, ప్రత్యేకించి, సూక్ష్మ ఆర్థిక, పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యం ఇచ్చేందుకు ఇప్పుడు ముద్రా బ్యాంకును ఏర్పాటుచేశారు. కొత్త బ్యాంకు ఏర్పాటైనందున సంబంధిత నియంత్రణ సంస్థల మార్గదర్శకాలు, నిర్దేశాలు కలగాపులగం కాకుండా చూడాలి. లేకపోతే కింది స్థాయిలో కార్యక్రమాల అమలు సంస్థలు అయోమయానికి గురి అవుతాయి. ఆర్‌బీఐ ప్రస్తుతం చిన్న బ్యాంకులకు లైసెన్సులు ఇస్తోంది. అనేక సూక్ష్మ ఆర్థిక సంస్థలు సైతం ఇప్పటికే ఈ లైసెన్సుల కోసం దరఖాస్తు చేశాయి. అందువల్ల ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించవలసి ఉంటుంది. వాణిజ్య బ్యాంకులు సమ్మిళిత ఆర్థికాభివృద్ధి గురించి కొన్ని దశాబ్దాలుగా మాట్లాడుతున్నాయి. కానీ, సూక్ష్మ రంగాన్ని మాత్రం విస్మరిస్తున్నాయి. చిన్న, సూక్ష్మ పారిశ్రామికవేత్తలకు అందుబాటులో తగినన్ని బ్యాంకుల శాఖలు లేవు. దాంతో వారికి ఆర్థిక సహాయం అందడం లేదు. ఇప్పుడు ముద్రా బ్యాంకు స్థానిక సమన్వయకర్తల భాగస్వామ్యంతో సూక్ష్మ చిన్న పరిశ్రమలకు ఆర్థిక సహాయానికి ముందుకు రావడం కచ్చితంగా మంచి పరిణామమే. సూక్ష్మ ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొనేవారందరికీ ఇప్పుడు ఒకే నియంత్రణ వ్యవస్థ ఉంటుంది.

## ప్రత్యామ్నాయాలూ అవసరమే...

ముద్రా బ్యాంకు సూక్ష్మ ఆర్థిక సంస్థలకు తక్కువ వడ్డీ రేటుపై మరింతగా రుణ సదుపాయం కల్పిస్తుంది. వివిధ సంస్థలతో భాగస్వామ్యం, రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీతో సమన్వయ-సహకారాల ఫలితంగా ఆర్థిక సేవల్ని మరింత విస్తరించడానికి, ఇప్పటిదాకా బ్యాంకుల వంటి సాధికార సంస్థల నుంచి రుణం పొందలేకపోతున్న సూక్ష్మ పరిశ్రమలకు ఆర్థిక సహాయం అందజేసేందుకు వీలు ఏర్పడుతుంది. ఇది ప్రశంసనీయమైన చర్యే. కానీ, ఇక్కడ ప్రత్యేకించి గమనించాల్సిన విషయం ఒకటుంది. ప్రైవేటు వడ్డీ వ్యాపారి అధిక వడ్డీలు వసూలు చేస్తున్నాడని నిందిస్తుంటారు. దగ్గర్లోనే వాణిజ్య బ్యాంకు శాఖ ఉన్నా విస్మరించి, మళ్లీ ఆ వ్యాపారి వద్దకే వెళ్లి అధిక వడ్డీమీద రుణాలు తీసుకొంటుంటారు. రుణదాత, గ్రహీత ఇరుగుపొరుగునే దశాబ్దాలుగా నివసిస్తుంటారు. వారి మధ్య రుణానుబంధం కొనసాగుతూనే ఉంటుంది. అధిక వడ్డీ వసూలు చేస్తున్నప్పటికీ, ఆ వడ్డీ వ్యాపారి వద్దే వారు రుణాలు ఎందుకు తీసుకొంటున్నారన్నది అధ్యయనం చేయాల్సిన విషయమే. ఈ పరిణామానికి వడ్డీరేటు ఒక్కటే కారణం కాదనిపిస్తోంది. చాణక్యుడు చెప్పినదాని ప్రకారం వడ్డీ రేటు అన్నది నష్ట ప్రమాదం మీద ఆధారపడి ఉంటుంది. రుణగ్రహీత వ్యాపార కార్యకలాపాల్లో నష్టప్రమాదం పెరిగినకొద్దీ వడ్డీ రేటూ పెరుగుతుంది. ప్రాచీన భారతదేశంలో అమలుచేసిన వడ్డీరేట్లను గమనిస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది. చేబదులు తీసుకొంటే 15శాతం వార్షిక వడ్డీరేటు వసూలు చేసేవారు. వ్యాపారులకు ఇచ్చే రుణం మీద 60శాతం వడ్డీ వేసేవారు. అటవీ ప్రాంతాలగుండా సరకు రవాణా చేసే వ్యాపారుల నుంచి 120శాతం, ఎగుమతులు-దిగుమతుల వ్యాపారం చేసే వారి వద్ద నుంచి 240శాతం వడ్డీ పిండుకొనేవారు. వడ్డీరేట్లు తగ్గించినంత మాత్రాన సూక్ష్మ పరిశ్రమల రంగంలోకి రుణ ప్రవాహం పెరుగుతుందని చెప్పలేం. ఈ దృష్ట్యా ముద్రా బ్యాంకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సి ఉంటుంది. పెద్దయెత్తున పత్రాలు, దస్తావేజులతో పనిలేకుండా సమీప ప్రాంతంలో, కోరుకున్న సమయంలో తగినంత మేరకు రుణాన్ని సులభంగా అందజేయగలగాలి. అప్పుడే ఆ ప్రక్రియ విజయవంతమవుతుంది.

(రచయిత- బెంగళూరులోని ఐఐఎంలో ఆర్‌బీఐ ఛైర్ ప్రొఫెసర్)